క్లుప్తంగా

రూ.59,500 ఆర్థికసాయం


గణేష్‌కు ఆర్థిక సహాయం అందజేస్తున్న తోటి కార్మికులు

ఎచ్చెర్ల క్యాంపస్: అరిణాంఅక్కివలసలోని శ్యామ్ క్రిగ్ ఫిష్షస్స్ ప్లాంట్-3 కార్మికుడు పుత్రోడు గణేష్ ఇటీవల బ్రెయిన్ సర్జరీ చేయించుకున్నాడు. తోటి కార్మికులు విరాళాల రూపంలో రూ.59,500 సేకరించి అరిణాం అక్కివలసలోని కార్మికుని ఇంటికి ఆదివారం వెళ్లి అందజేశారు. త్వరితగతిన కోలుకోవాలని ఆకాంక్షించారు. స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు ఎస్.వి.రమణ, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన


కేశవరావుపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న ప్రకృతి వ్యవసాయం సిబ్బంది, రైతులు

ఎచ్చెర్ల క్యాంపస్: ఖరీఫ్ ప్రణాళికలపై ఆదివారం ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు ఆధ్వర్యంలో కేశవరావుపేట గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. మాస్టర్ ట్రైనర్ లక్ష్మన్నాయుడు ప్రకృతి వ్యవసాయం అవగాహన కల్పించారు. పురుగు మందులు, రసాయన ఎరువుల రహిత వ్యవసాయానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. నవధాన్యాల సాగు వల్ల కలిగే లాభాలను వివరించారు. గ్రామ పెద్దలు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

శంకరాచార్యులను ఆదర్శంగా తీసుకోవాలి


ఆధ్యాత్మిక ప్రవచనం చేస్తున్న రామనాథశర్మ

శ్రీకాకుళం కల్చరల్: ప్రతి ఒక్కరూ శంకరాచార్యులను ఆదర్శంగా తీసుకొని నడవాలని ప్రముఖ పురాణ ప్రవచన కర్త మల్లాది వెంకట రామానాథ శర్మ అన్నారు. గుజరాతీపేటలోని రాజరాజేశ్వరీ లలితా మహా త్రిపుర సుందరి దేవీ పీఠంలో జరుగుతున్న ఆది శంకరాచార్యుల జయంతి ఉత్సవాల సందర్భంగా ఆదివారం 'జగద్గురు ఆదిశంకరులు- ఆమ్నాయ పీఠముల వైభవం'అనే అంశంపై ప్రసంగించారు. దక్షిణామ్నాయ శృంగేరి పీఠం శివస్థత, గురుపరంపర, తదితర పీఠాల ఏర్పాటు ఎలా జరిగిందో వివరించారు. కార్యక్రమంలో పీఠం నిర్వాహకులు పెంట రామచంద్రశేఖరశర్మ, వశిష్ట కార్తికేయశర్మ, ఇప్పిలి ప్రభాకరరావు, బారువ కోమలరావు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణం నిలిపివేత


ఆక్రమణ స్థలం వద్ద రెవెన్యూ సిబ్బంది

గార: మండలంలోని అంపోలు పంచాయతీ జిల్లా జైల్ రోడ్డులో ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలను రెవెన్యూ అధికారులు నిలిపివేశారు. ఆదివారం 'ప్రభుత్వ భూమిలో ఆక్రమ నిర్మాణాలు'శీర్షికతో సాక్షిలో కథనం ప్రచురితం కావడంతో అధికారులు స్పందించారు. సర్వే నంబర్ 12లో విలువైన భూమిని అంపోలు పంచాయతీ మాజీ సర్పంచ్ కుటుంబ సభ్యుడు కబ్జా చేసిన స్థలాన్ని మండల ఆర్ఐ డి.రాజేంద్ర, వీఆర్వో మోహనరావులు పరిశీలించారు. పనులు నిలిపివేయాలని, లేదంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

పెద్దబాలశిక్షతో అనేక లాభాలు

ఎచ్చెర్ల: ప్రాథమిక స్థాయి నుంచే ప్రతీ విద్యార్థి పెద్దబాలశిక్ష పుస్తకం కోసం తెలుసుకోవాలని రిసోర్స్ పర్సన్ లంకలపల్లి సత్య అన్నారు. వేసవి శిక్షణలో శిబిరంలో భాగంగా లావేరు శాఖా గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులకు పెద్దబాలశిక్ష పుస్తకం వల్ల కలిగే లాభాలను వివరించారు. బ్రిటీష్ వారు మన దేశాన్ని పరిపాలించే కాలంలో ఆంధ్రప్రదేశ్ పాఠశాలల్లో పిల్లలకు పెద్దబాల శిక్ష సిలబస్‌గా ఉండేదన్నారు. విద్యార్థులు మొట్టమొదట తమ విద్యాభ్యాసాన్ని పెద్దబాల శిక్షతోనే ప్రారంభించారని తెలిపారు. పెద్దబాల శిక్ష కోసం తెలుసుకుంటే ప్రపంచంలో అన్ని విషయాలను తెలుసుకునేలా భావించేవారన్నారు. గ్రంథాలయ సహాయకుడు టి.వీరభద్రుడు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడండి


మొక్కలు నాటుతున్న జడ్జి సుబ్బారెడ్డి

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): మొక్కలు నాటడం తోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యపడుతుందని హైకోర్టు, జిల్లా పోర్ట్‌ఫోలియో జడ్జి సత్తి సుబ్బారెడ్డి అన్నారు. శ్రీకాకుళం నగరంలోని కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. మొక్కలు నాటాలని అప్పుడే పర్యావరణ సమతుల్యతగా ఉంటుందని.. ఆ బాధ్యతలను ప్రతిఒక్కరూ తీసుకోవాలన్నారు. జిల్లా జడ్జి జునైద్ మహమ్మద్ మౌలానా, సీనియర్ న్యాయవాది కొంక్యాన సుభాష్, బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

అరసవల్లిలో వైశాఖి సందడి..

- ఆదిత్యుని దర్శనానికి భారీగా తరలివచ్చిన భక్తజనం
- వేసవి తీవ్రతతో అవస్థలు పడిన భక్తులు
- స్వామివారికి సంప్రదాయ ప్రసాదాల నివేదన


పుష్కరిణి వద్ద పూజలు చేస్తున్న మహిళలు


ఇంద్రపుష్కరిణి వద్ద స్నానాలు, పూజలు చేస్తున్న భక్తులు

అరసవల్లి:

వైశాఖ మాసం రెండో ఆదివారం సందర్భంగా అరసవల్లి సూర్యక్షేత్రం కిటకిటలాడింది. జిల్లాతోపాటు వేర్వేరు ప్రాంతాల నుంచి భారీగా తరతలివచ్చిన భక్తులతో అరసవల్లి ఆలయ ప్రాంతమంతా జన సందోహంగా మారింది. స్వామివారికి గ్రామీణ ప్రాంత మహిళలు సంప్రదాయ పూజలతో పాటు మొక్కులను సమర్పించుకున్నారు. ఇంద్రపుష్కరిణిలో పెసల మొలకలు, పరమాన్నం, చలిమిడి, బెల్లం, పటిక, గోధుమలు, మామిడి పళ్లు, కొబ్బరి బొండాలతో కూడిన ప్రత్యేక ప్రసాదాలను స్వామికి నివేదించారు. అలాగే ఆరోగ్యం కోసం భారీగా భక్తులు సూర్యనమస్కారాల పూజలను చేయించుకోగా.. మరికొందరు తలనీలాలు సమర్పించుకున్నారు. ఇదిలావుంటే జిల్లా దేవదాయ శాఖ నుంచి అధికార సిబ్బందిని డిప్యూట్ చేయడంతో పాటు దర్శనాల మార్గాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేయడంతో దర్శనాలైతే సజావుగానే సాగాయి. అయితే ఎప్పటిలాగానే నకిలీ సిఫారసులతో ప్రత్యేక దర్శనాలు మాత్రం యథేచ్ఛగా కొనసాగాయి. ప్రధాన రహదారిలో వాహనాల రద్దీ పెరగడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది.

ఎండలో భక్తుల అవస్థలు

భానుని ప్రతాపం ఆదివారం ఉదయం నుంచి అధికంగా ఉండండంతో భక్తులు తీవ్ర అవస్థలు పడ్డారు. ఆలయ పరిసరాలన్నీ భక్తులతో కిటకిటలాడటంతో పాటు దర్శన మార్గాల్లో బారులు తీరడంతో ఉక్కబోతతో ఇబ్బందులు పడ్డారు. ఆలయ అధికారులు టెంట్లు, షామియానాలు వేయించినప్పటికీ తగినంతగా ఉపశమనాన్ని అందివ్వలేకపోయారని భక్తులు బాహాటంగానే విమర్శించారు. ఆలయం లోపల భక్తుల తాకిడి పెరిగిపోవడంతో అంతరాలయం ముందు శఠగోపం, తీర్థాన్ని ఇచ్చే ప్రక్రియను ఆలయ ఈవో శోభారాణి తాత్కాలికంగా నిలిపి వేయడం విమర్శలకు గురిచేసింది. భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా ఇలాంటి ప్రక్రియలు తగదని అసంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే ప్రసాదాల విక్రయాలపై మరోసారి ఏర్పాట్ల ప్రభావం పడింది. ప్రసాదాలు తెస్తున్న వాహనాలను భక్తుల దర్శనాల మార్గాలు అడ్డుకోవడంతో సకాలంలో చేర్చలేకపోయారు. దీంతో ప్రసాదాల విక్రయాలు ఈ వారం కూడా తగ్గిపోయాయి. తొలి వైశాఖ వారంలో కూడా భక్తులకు ప్రసాదాలు అందించేలా ఏర్పాట్లు చేయలేదనే అసంతృప్తి వ్యక్తమయ్యింది. గతంలో ఆలయం ముందు దర్శనానంతరం బయటకు వచ్చే మార్గంలోనే అన్నదాన ప్రసాదాల విభాగం, కౌంటర్లు ఉండడంతో ఆదాయం రెట్టింపుగా వచ్చేది. అయితే ఆలయం ముందు భవనాలన్నీ కూల్చివేయడంతో ఆదాయం తగ్గినట్లుగా ఆలయ వర్గాలు అంచనా వేస్తున్నాయి.


దేశ రక్షణ కోరుతూ సూర్యనమస్కార పూజలు చేస్తున్న జనసేన పార్టీ నాయకులు


దర్శనాలకు బారులు తీరిన భక్తజనం

భారత దేశం, సైనిక రక్షణ కోసం సౌరహోమం

భారత్-పాక్ మధ్య యుద్ధ వాతావరణం నేపథ్యంలో జనసేన పార్టీ నాయకుల ఆధ్వర్యంలో సూర్యనారాయణ స్వామి వారి ఆలయంలో ప్రత్యేక సౌర హోమంతో పాటు ప్రత్యేక సూర్యనమస్కారాల పూజలు జరిపించారు. భారత సైన్యం రక్షణతో పాటు భారతదేశ రక్షణ కోరుతూ ఆదిత్యున్ని ప్రత్యేక అర్చనలు చేయించినట్లుగా సుడా చైర్మన్ కె.రవికుమార్, పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ, తూర్పు కాపు సంక్షేమ కార్పొరేషన్ చైర్‌పర్సన్ పాలవలస యశస్వి, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు పిసిని చంద్రమోహన్ తెలిపారు. ఆలయ ఈవో కె.శోభారాణి, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ తదితరులు పాల్గొన్నారు.

రూ. 12.39 లక్షల ఆదాయం:

వైశాఖమాసం రెండో ఆదివారం భక్తులు పోటెత్తడంతో ఒక్కరోజులో రూ.12,39,469 వరకు ఆదాయం లభించింది. ఆదివారం మధ్యాహ్నం రెండు గంటల వరకు ఈ మేరకు ఆదాయం రికార్డయ్యిందని ఆలయ ఈవో కె.శోభారాణి తెలిపారు. వివిధ దర్శనాల టిక్కెట్ల ద్వారా రూ.8,50,600, విరాళాలు, ప్రత్యేక పూజల ద్వారా రూ.1,63,869, ప్రసాదాల టిక్కెట్ల విక్రయాల ద్వారా రూ. 2.25 లక్షల వరకు ఆదాయం లభించినట్టు పేర్కొన్నారు.


మొక్కులు తీర్చుకుంటున్న తల్లీకుమారులు

పోలీసుల అనుచిత ప్రవర్తన సరికాదు

- ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

జి.సిగడాం: మాజీ మంత్రి, బీసీ నేత విడదల రజినిపై చిలకలూరిపేట రూరల్ సీఐ సుబ్బనాయుడు చేసిన అనుచిత ప్రవర్తన మంచి పద్ధతి కాదని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. ఆదివారం మండలంలోని నడిమివలసలో మాట్లాడారు. పవన్, లోకేష్ వద్ద పేరు కోసమే ఇటువంటి ప్రవర్తన చేశారన్నారు. రాష్ట్రంలో ఏడాది కాలంగా రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోందన్నారు. ఎన్నికల ముందు పేదలకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ యువతకు భృతి ఎప్పుడు ఇస్తారని ప్రశ్నించారు. మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, పార్టీ మండల అధ్యక్షుడు డోల వెంకటరమణ, జిల్లా ప్రధాన కార్యదర్శి సనపల నారాయణరావు, జిల్లా అధికార ప్రతినిధి పిల్లల శివకుమార్, జిల్లా కార్యదర్శి పేడాడ శ్రీరామ్మూర్తి, నియోజకవర్గ ఐటీ వింగ్ అధ్యక్షుడు చిత్తిరి మోహన్, సర్పంచ్ వడిశ మహేశ్వరరావు, ఎంపీటీసీ గేదెల నారాయణరావు, బూత్ కమిటీ అధ్యక్షుడు మీసాల శ్రీనివాసరావు, మంతిన శ్రీనివాసరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అపూర్వ సమ్మేళనం


సంతవురిటి జెడ్పీహెచ్‌ఎస్‌లో 1996-97 టెన్త్ బ్యాచ్, ఉపాధ్యాయులు


జి.సిగడాం జెడ్పీహెచ్‌ఎస్‌లో 1996-2001 విద్యార్థులు, ఉపాధ్యాయులు

జి.సిగడాం: మండలంలోని సంతవురిటి జెడ్పీహెచ్‌ఎస్‌లో 1996-97లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులంతా ఆదివారం ఆత్మీయిక కలయిక ఏర్పాటు చేశారు. అప్యాయంగా పలకరించుకుని ఆనందంగా గడిపారు. అప్పటి ఉపాధ్యాయులు ఎ.శోభాదేవి, పి.జనార్దనరావు, వి.సత్యం, టి.సత్యనారాయణ, హరికృష్ణను సత్కరించారు. జి.సిగడాం జెడ్పీహెచ్‌ఎస్‌లో 1996-2001 వరకు చదువుకున్న విద్యార్థులంతా ఆత్మీయిక కలయిక ఏర్పాటు చేశారు. విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సత్కరించారు.

ఘనంగా రామయ్య సంబరాలు


పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

జి.సిగడాం: జి.సిగడాం మండల కేంద్రంలో పిన్నింటి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో రాయ్య సంబరాలు ఘనంగా నిర్వహించారు. గత మూడు రోజులపాటు సంబరాలు నిర్వహించారు. ఆదివారం ముగింపు సందర్భంగా గ్రామంలో భారీ అన్నదానం చేపట్టారు.

అధ్వానంగా..



ఎచ్చెర్ల క్యాంపస్ :ఎచ్చెర్ల మండలం ఎస్‌ఎం పురం పంచాయతీ భానోజీరావుపేట గ్రామానికి వెళ్లే సిమెంట్ రోడ్డు అధ్వానంగా తయారైంది. రోడ్డు పూర్తిగా పాడవటంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు దృష్టికి సైతం ఈ సమస్యను తీసుకువెళ్లారు. రోడ్డు నిర్మించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

రక్తదాన శిబిరం



ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో గ్రాబీజ్ ఫ్యాషన్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఆన్‌లైన్ ప్రొడక్టు సెల్లింగ్ సంస్థ ఉద్యోగులు ఆదివారం ఉచిత రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. 45 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచారు. ఈ సందర్భంగా రెడ్ క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు మాట్లాడుతూ.. ఇటీవల రాష్ట్ర గవర్నర్ ప్రారంభించిన తలసేమియా సెంటర్, సత్యసాయి జిల్లా కదిరికి చెందిన సైనికుడు మురళి నాయక్, పాకిస్తాన్, భారతదేశ ఉధృత పరిస్థితుల సమయంలో వీరమరణం పొందిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని శ్రద్ధాజలి ఘటించిన పిదప యువత స్వచ్ఛంద రక్తదానం చేశారని అన్నారు. కార్యక్రమంలో సంస్థ మేనేజర్ వి.అప్పలరాజు, రెడ్ క్రాస్ ప్రతినిధులు కె.సత్యన్నారాయణ, పి.చైతన్యకుమార్, సుజాత, సంస్థ సభ్యులు దుర్గాకల్యాణ్, రామ్ శెట్టి సురేష్, మార్కెటింగ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. – శ్రీకాకుళం కల్చరల్

జాతీయ సమైక్యతకు కృషి



జాతీయ సమైక్యతకు ప్రఉఒక్కరూ కృషి చేద్దామని గార జెడ్పీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు పిలుపునిచ్చారు. 1988 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పెహల్గాం ఘటన, భారత్- పాక్ యుద్ధంలో మృతి చెందిన భారతీయులు, ఉపాధ్యాయులు, తోటి పూర్వ విద్యార్థులకు సంతాపం తెలియజేశారు. మెజీషియన్ బి.శ్రీనివాసరాజు ఇంద్రజాల ప్రదర్శన అలరించింది. తహసీల్దార్ ఎం.చక్రవర్తి, విశ్రాంత ఉపాధ్యాయులు బోర వాసుదేవరావు, బీఎంఎస్ పట్నాయక్, మాధవరావు, చిట్టి గోవిందరావు, మాణిక్యాలరావు, హెచ్‌ఎం భారతిని సత్కరించారు. పూర్వ విద్యార్థుల కమిటీ ప్రతినిధి కొంక్యాన వేణుగోపాల్, మార్పు మన్మథ, కె.శాంతారావు, డి.వి.కొండలరావు, గదిలి రమణ, వల్లంశెట్టి వెంకటరావు, సీహెచ్ ఆనందరావు, వెలమల గోవింద పాల్గొన్నారు. –గార

గోతులమయం..

- అధ్వానంగా రహదారులు
- పట్టించుకోని పాలకులు, అధికారులు


గోతులమయంగా ట్రిపుల్ ఐటీ నుంచి ఎస్‌ఎంపురం వెళ్లే రోడ్డు

ఎచ్చెర్ల క్యాంపస్: కూటమి ప్రభుత్వ వచ్చిన తరువాత చేసే అభివృద్ధి కంటే.. సోషల్ మీడియాలో ప్రచారమే ఎక్కువగా ఉంది. ఎచ్చెర్ల నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. మరమ్మతులపై కనీసం దృష్టి పెట్టటం లేదు. రూ.కోట్లతో నిధులు మంజూరైనట్లు ప్రచారం చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో మాత్రం రహదారుల్లో అడుగుకో గొయ్యి దర్శనమిస్తోంది. ప్రభుత్వ కార్యాలయాలు, ప్రజాప్రతినిధులు చుట్టూ ఆయా గ్రామాల ప్రజలు తిరుగుతున్నారు. ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు నిర్వహిసున్న ప్రజా దర్బార్‌లకు, నమస్తే ఎచ్చెర్ల వంటి కార్యక్రమాల్లో సైతం రోడ్డు సమస్యలపై ఎక్కువగా వినతులు వస్తున్నాయి.

రహ'దారుణాలు'..

ఎచ్చెర్ల మండలంలో కుశాలపురం-వెంకటాపురం రోడ్డు గోతులుమయంగా మారింది. యాతపేట నుంచి సింహ ద్వారా వరకు కిలో మీటరు పైన రోడ్డు నిర్మాణం కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారు. ఎస్‌ఎంపురం రాజీవ్ గాంధీ వైజ్ఞాన సాంకేతిక విశ్వవిద్యాలయం నుంచి ఎస్‌ఎంపురం, కేశవరావుపేట నుంచి ఎస్‌ఎంపురం పెద్ద చెరువు వరకు రోడ్డు అధ్వానంగా మారింది. తోటపాలెం కూడలి నుంచి కొత్తపేట, శెగిడిపేట, ముద్దాడ అంబేడ్కర్‌నగర్ వరకు రోడ్డుకు నిధులు మంజూరైనా పనులు మాత్రం ప్రారంభం కాలేదు. తోటపాలెం నుంచి ముద్దాడ రోడ్డు గోతులమయంగా మారింది. నవభారత్ నుంచి పెయిలవానిపేట, కొంచాలకూర్మయ్యపేట నుంచి దోమాం వెళ్లే రోడ్డు అధ్వానంగా మారింది. కొయ్యాం నుంచి బడివానిపేట వెళ్లే రోడ్డు పూర్తిగా పాడైంది.

- రణస్థలం మండలంలో సీతారంపురం నుంచి పాతర్లపల్లి వెళ్లే రోడ్డు గోతులమయంగా మారింది. దేరసాం రోడ్డు కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారు.
- లావేరు మండలంలోని రహదారుల కోసం పలు గ్రామాల ప్రజలు ఎదురుచూస్తున్నారు. బొంతుపేట, మెట్టవలస, బెజ్జిపురం, బుడతవలస, మురపాక, చిన్నయ్యపేట, అదపాక గ్రామాల పరిధిలో రోడ్డు నిర్మాణాలు, మరమ్మతులు చేపట్టాలని విన్నవిస్తున్నారు.
- జి.సిగడాం మండలంలో పాతపెంట, నాగులవలస, దవళపేట, విజయరాంపురం, సంతఉరిటి గ్రామాల పరిధిలో రోడ్లు అధ్వానంగా మారాయి.

వర్షా కాలంలో ఇబ్బంది



నియోజకవర్గంలో రోడ్లు ప్రధాన సమస్యగా మారాయి. వర్షాకాలంలో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. కొన్ని గ్రామాల్లో రోడ్లు పూర్తిగా పాడయ్యాయి. కూటమి ప్రభుత్వం రహదారుల నిర్మాణానికి ప్రాధాన్యం నివ్వాలి. నిధులు మంజూరైన గ్రామాల్లో పనులు త్వరితగతిన ప్రారంభించాలి.

– మాదుగుల జగదీశ్వరరావు, ఎంపీటీసీ, బొంతలకోడూరు

చర్యలు తీసుకుంటాం



గ్రామ స్థాయిలో ఉపాధి పథకం మెటీరియల్ కంపోనెంట్ నిధులతో రోడ్డులు నిర్మించాం. ప్రస్తుతం చాలా రోడ్డులకు నిధులు మంజూరయ్యాయి. ప్రాధాన్యతాక్రమంలో రోడ్డులు నిర్మిస్తాం. నిధులు మంజూరైన రోడ్డు పనులు ప్రారంభిస్తాం. టెండర్లు దశలో ఉన్న రోడ్డుల నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం.

– సనపల శ్రీరాములు, పంచాయతీరాజ్ డీఈ, ఎచ్చెర్ల

ప్రతిభకు పురస్కారం


రణస్థలం: ఈ-వేమనను అక్షరతేజం బిరుదుతో సత్కరిస్తున్న నిర్వాహకులు


జి.సిగడాం: కోవెలకొండను జాతీయ ప్రతిభా పురస్కారంతో సత్కరిస్తున్న కళావేదిక నిర్వాహకులు

రణస్థలం: శ్రీశ్రీ కళా వేదిక ఉత్తరాంధ్ర అధ్యక్షుడు, ప్రముఖ కవి, రచయిత మహ్మద్ రఫీ(ఈ-వేమన)కు అక్షర తేజం బిరుదుతో శ్రీశ్రీ కళా వేదిక సీఈఓ డాక్టర్ కత్తిమండ ప్రతాప్, జాతీయ కన్వీనర్ కొల్లి రమావతి ఆదివారం ఘనంగా సత్కరించారు. ఐఎస్ఓ గుర్తింపు పొందిన అంతర్జాతీయ సాహిత్య సంస్కృతిక సేవా సంస్థ శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో కవులు, కళాకారులకు తెలుగు భాష, సాహిత్యాన్ని ప్రోత్సహిస్తూ ఏలూరులో నిర్విధికంగా 48 గంటల వరల్డ్ రికార్డ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రణస్థలం గ్రామానికి చెందిన ఈవేమన ప్రతిభ కనబర్చడంతో అక్షర తేజం బిరుదుతో సత్కరించారు. సాహితి, కళా సంస్థల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

కోవెలకొండకు..

జి.సిగడాం: మండలంలోని జగన్నాథవలస గ్రామానికి చెందిన కోవెలకొండ సంతోష్‌కుమార్ స్వామి ఏలూరులో శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన తెలుగు భాషా సాహిత్యంపై మంచి ప్రతిభను కనబర్చారు. జాతీయ ప్రతిభా పురస్కారాన్ని అందుకున్నారు. ఈయన వీరఘట్టం మండలం చిదిమి పాఠశాలలో తెలుగు పండిట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. పలువురు ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.